క్లుప్తంగా

ఓటర్ల అభ్యంతరాలపై నివేదికలు సమర్పించండి

గూడూరు: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా వచ్చిన అభ్యంతరాలపై బూత్ లెవెల్ అధికారులు విచారణ నిర్వహించి నివేదికలు సమర్పించాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. బూత్‌ల వారీగా వచ్చిన అర్జీలపై సమీక్ష నిర్వహించిన తహసీల్దార్ విజయప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. అదే సమయంలో చనిపోయిన వారి ఓట్ల విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా లోతైన విచారణ చేసి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి డోర్ నంబర్లు మారిన సందర్భంలో గుర్తింపు కార్డులో కొత్త చిరునామాతో కొత్త కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి..సంరక్షించాలి

పెడన: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని నందమూరు సర్పంచ్ పరసా నరసింహారావు అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నందమూరు గ్రామ సచివాలయం ఆవరణలో మేరా దేశ్...మేరా మట్టి కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి సర్పంచు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కుమార్‌బాబు, డైరెక్టర్ డి బాబా, ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వ్రతాలు

బంటుమిల్లి: స్థానిక సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వర స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారి పూజ రోజైన ఏడు శనివారాల వ్రతాలను పలువురు భక్తులు ఆచరించారు. గీతా సత్సంగం భక్తురాలు కట్టా లక్ష్మీరత్నకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

సేవలకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

చల్లపల్లి: అభాగ్యుల సేవకు ప్రతిరూపంగా సెయింట్ మదర్ థెరిస్సా ప్రపంచానికి సేవా భావం నేర్పారని లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ అధ్యక్షుడు మోపిదేవి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ గృహం వృద్ధాశ్రమంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ పెద్దలు నర్రా సాయి, ముమ్మనేని నాని, తగిరిశ సాంబశివరావు, రాయపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

అవనిగడ్డలో రెండు పూరిళ్లు దగ్ధం

రూ.4 లక్షల ఆస్తి నష్టం



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని భారతీ హాస్పటల్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన రెండు పూరిళ్లు విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు పడటంతో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగింది. అగ్నిమాపక అధికారి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన రహదారి పక్కన సూరగం సుబ్రహ్మణ్యం, కేసాని ధనమ్మకు చెందిన పూరిళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగలు రాసుకుని నిప్పురవ్వలు పడ్డాయి. వెంటనే పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి ప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల ఉన్న గ్యాస్ సిలిండర్లను సిబ్బంది చాకచక్యంతో బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ సమయంలో యజమానులు కూలీ పనులకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

విద్వేషపూరిత రాజకీయాలతో పెనుముప్పు

అవనిగడ్డ: విద్వేష పూరిత రాజకీయాలు భారత దేశానికి పెనుముప్పుగా మారాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రపంచ దేశాల్లో భారత్ పరువుని దిగజారుస్తోందన్నారు. జాతులు, మతాల మధ్య చిచ్చుపెడుతూ భారతదేశ విచ్ఛిన్నానికి బీజేపీ ప్రయత్నిస్తోందని చెప్పారు. స్వాతంత్య్ర ఉద్యమంలో సంబంధం లేనివారు, పోరాటంలో పాల్గొనని వారు దేశ భక్తులుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వై. మధు, నాయకులు వాకా రామచంద్రరావు, బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా పథకాలు

- నేరుగా లబ్ధిదారుని ఖాతాకే జమ చేస్తున్న ప్రభుత్వం
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్



వృద్ధురాలి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్

పెడన: ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం ఆయన గురువిందగుంట గ్రామ సచివాలయం పరిధిలోని కొంగంచర్ల, కుమ్మరిగుంట, కవిపురం, గురువిందగుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మీ ఇంటికి పెద్ద కొడుకుగా, తోబుట్టువుగా పలు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. అంగన్‌వాడీ చిన్నారులతో మంత్రి ముచ్చటించారు. ఏమి పెడుతున్నారంటూ చిన్నారులను మంత్రి ప్రశ్నించగా గుడ్డు, పాలు, అన్నం అంటూ చిన్నారులు బదులీయడంతో ఆనందం వ్యక్తం చేశారు. కొంగంచర్ల గ్రామంలో ఓం సాయిరాం డ్వాక్రా గ్రూపు సభ్యులైన మహిళలు మంత్రిని కలిసి తమ గ్రూపునకు రూ. 20 లక్షల వరకు రుణ అర్హత ఉందని, మంజూరు చేయించాలని కోరగా.. వెంటనే సంబంధిత సిబ్బందికి మంత్రి ఆదేశాలు ఇచ్చి మంజూరు చేసేలా చూడాలని సూచించారు.

అభివృద్ధి పనులకు రూ. 40 లక్షలు..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని గుర్తించిన అభివృద్ధి పనులకు సచివాలయ పరిధిలో తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గానికి రూ.40 లక్షల వరకు మంజూరు చేయడానికి హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద కొంగంచర్ల గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇచ్చామని మంత్రి తెలిపారు. కొంగంచర్ల, గురువిందగుంట, కుమ్మరిగుంట, కవిపురం గ్రామంలో వైఎస్సార్ పింఛన్ కానుక పథకం, రైతు భరోసా, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, పంటల బీమా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని వివరించారు. పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న మంచి పథకాలను చూసి కాపీ కొట్టి పేరు మార్చి అధికారంలోకి రావాలని టీడీపీ అడ్డదారులు తొక్కుతోందని, అటువంటి వారిని ఉపేక్షించవద్దని చెప్పారు. కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికపాటి రామానాయుడు, అచ్యుతరావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, హౌసింగ్ ఏఈ మాధవి, ట్రాన్స్ కో ఏఈ కె. జయరాం, ఈఓపీఆర్డీ ఎం. జయరాము, సర్పంచులు లోయ ఊహ, స్వరూప రాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు తిక్కిశెట్టి ప్రసాద్‌బాబు, లోయ అంజనేయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- సబ్‌జోన్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: క్రీడాకారులు ప్రతిభ చూపి క్రీడల్లో రాణించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. క్రీడల్లో సత్తా చాటడం ద్వారా ఎందరో క్రీడాకారులకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందని చెప్పారు. అలాంటి వారిని స్ఫూర్తిగా క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

స్థానిక ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సబ్‌జోన్ క్రీడా పోటీలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈనెల 29వ తేదీన హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటడం ద్వారా పేదరికాన్ని జయించి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారులు ఎందరో ఉన్నారని వివరించారు. సబ్‌జోన్ పరిధిలో జరిగే ఈ పోటీల్లో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

తొలి రోజు జరిగిన పురుషుల లాంగ్ జంప్‌లో అవనిగడ్డ నారాయణ స్కూల్ విద్యార్థి చాణక్య వర్ధన్ ప్రథమస్థానం, కోడూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి కె. సుబ్రహ్మణ్యం ద్వితీయ, పులిగడ్డ ఏపీఆర్ఎస్ విద్యార్థి కె. నవనీత్ తృతీయ స్థానం సాధించారు. డిస్కస్‌త్రోలో అవనిగడ్డ హైస్కూల్ విద్యార్థులు సీహెచ్ లోకేష్ ప్రథమ, ఎం. ఆకాష్ ద్వితీయ, లింగారెడ్డిపాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎ. దీవెన బాబు తృతీయస్థానంలో నిలిచారు. షాట్‌పుట్‌లో అవనిగడ్డ హైస్కూల్ విద్యార్థి ఎస్. జయదేవ ప్రథమ, పులిగడ్డ ఏపీఆర్ఎస్ విద్యార్థులు ఎం. స్టీఫెన్ ద్వితీయ, బి. మణికంఠ తృతీయ స్థానం సాధించారు.

800 మీటర్ల పరుగు పందెంలో పులిగడ్డ ఏపీఆర్ఎస్ విద్యార్థులు కె. మణికంఠ ప్రథమ, ఎస్. అక్షయకుమార్ తృతీయ, నాగాయలంక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఆర్. హరీష్ ద్వితీయ స్థానం పొందారు. కబడ్డీలో కోడూరు జెడ్పీహెచ్ఎస్, పులిగడ్డ ఏపీఆర్ఎస్ జట్లు ఫైనల్‌కు చేరాయి. కార్యక్రమంలో ఏడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 భోజనం పేదలకు వరం

డీఆర్వో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

మచిలీపట్నంటౌన్: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 15 లకే భోజనం అందిస్తుండటం పేదలకు వరమని డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గుప్తా సెంటర్‌లో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రూ. 15 లకే భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో ఉన్న సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులు వారి సహాయకులు నగరంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహాయ ఫౌండేషన్ సేవలు వినూత్నంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ సేవా క్యాంటీన్ ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేద రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, ఎముకల వైద్య నిపుణులు అల్లాడ శ్రీనివాసరావు, ఆర్కే విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ, రిటైర్డ్ ఏఎస్పీ శాయన సుశీలరావు, గాజుల సాంబయ్యానాయుడు, నూర్జహాన్ బేగం, న్యాయవాది బాలాజీ, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాదరావు, కోశాధికారి తాతా సాయిరతన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మదర్ థెరిస్సా చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కనుల పండువగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



గర్భాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు



ఆలయంలో నూతన విగ్రహాలను దర్శించుకున్న ఎమ్మెల్యే సింహాద్రి

నాగాయలంక: తిప్పాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో హనుమాన్ లక్ష్మణ సమేత సీతారాముల నూతన యంత్ర, విగ్రహ స్థిర ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఉదయం 11.11 గంటలకు కనుల పండువగా జరిగింది. భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య పీటలపై కూర్చున్న పది జంటల సమక్షంలో గుంటూరుకు చెందిన కె.భానుప్రసాద్ సారథ్యంలో యంత్ర, విగ్రహాల ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. తొలుత బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజ శేఖరశర్మ (గుంటూరు) బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. సీతారాముల శాంతి కల్యాణం, పూర్ణాహుతి, అవభృతస్నానం జరిపి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమా బాబూరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సీతారాములను దర్శించుకున్న ఎమ్మెల్యే సింహాద్రి..

నాగాయలంక: తిప్పాలెంలోని రామాలయంలో స్వామివార్లను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమా బాబూరావు, కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. తొలుత ఎమ్మెల్యే యాగశాలను సందర్శించి హోమాలను తిలకించారు. అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఆకుల బాబి, కొండవీటి మురళి, మద్ది కొండలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో ఎస్టీ (యానాదులు)లకు కేటాయించిన గృహ నిర్మాణాలను మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్స్‌లో ప్రధానంగా ఎస్టీలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తోందన్నారు. ఇప్పటికే మోపిదేవిలో 9 గృహాలు, వెంకటాపురంలో రెండు గృహాల నిర్మాణాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కోసూరువారిపాలెంలో ఈనెల 14వ తేదీన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు 10 ఎస్టీ కుటుంబాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని వివరించారు.

బీమా సొమ్ము అందజేత

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం కాలనీకి చెందిన అంజయ్య శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మట్టి ఖర్చుల కింద మంజూరైన రూ. 10 వేలను వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం మృతుడి భార్య రమణకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యెనుముల కొండ, వార్డు సభ్యుడు జి. శ్రీనివాసరావు, జగదీష్, నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వరదత్త వెంకటేశ్వరస్వామి కల్యాణం

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు వరదత్త వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం జరుగుతుందని దత్తాశ్రమం నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆరు గంటలకు కల్యాణం వైభవంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామివారికి తైలాభిషేకం, గోపూజ, వెయ్యి మంది ముత్తయిదువలకు కుంకుమ, జాకెట్ ముక్క అందజేస్తామని చెప్పారు. భక్తులకు అన్నప్రసాదం జరుగుతుందన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోవాలి

పెడన: పీఎం కిసాన్‌కు రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్. పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1.19 లక్షల మంది వరకు ఈకేవైసీ చేయించుకున్నారని, 18,325 మంది ఇంకా చేయించుకోవాల్సి ఉందని చెప్పారు. వీరు ఫోన్ నెంబర్లు ఇచ్చినా అవి పనిచేయడం లేదని, కొందరు బ్యాంకు ఖాతాలకు సరిగ్గా లింకు చేయకపోవడం, ఇంకా చనిపోయిన వారి పేర్లతోనే ఉండటం వంటి కారణాల వల్ల ఈకేవైసీ చేయించుకోని వారున్నట్లుగా గుర్తించామని చెప్పారు. ఇటువంటి రైతులు తక్షణం సంబంధిత ఆర్‌బీకేలలో సిబ్బందిని కలిసి పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ అయిందీ, లేనిదీ సరి చూసుకోవాలన్నారు. బ్యాంకులకు వెళ్లి ఖాతా సంబరుకు ఆధార్ లింకుతో పాటు, ఫోన్ నంబర్ లింకు చేయించుకోవాలని చెప్పారు. పేర్ల మార్పు కోసం రెవెన్యూ సిబ్బందిని, అధికారులను కలిసి లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 30లోగా పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకుంటే 15వ విడత పీఎం కిసాన్ నగదు రూ. రెండు వేలు జమ అవుతాయని వివరించారు.

వైద్య సేవలు అభినందనీయం

పేర్ని కిట్టు



సమావేశంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన్ సంస్థాన్ ఆక్యుప్రెజర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. వారం రోజులుగా స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ఆవరణలో వాసవీ విద్యార్థి సహాయనిధి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్యుప్రెజర్, అయస్కాంత వైద్యశిబిరం శనివారంతో ముగిసింది. కళాశాల ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పేర్ని కిట్టు మాట్లాడుతూ వైద్యసేవ చేసేందుకు రాజస్థాన్ నుంచి వచ్చిన వైద్య బృందానికి కొత్తగుండు రమేష్ వసతి కల్పించడం ఆయన సేవా గుణానికి నిదర్శమన్నారు. కార్పొరేటర్ పల్లి శేఖర్, ఆక్యుప్రెజర్ వైద్యులు తన్‌రాజ్ చౌదరి, రేవంత్ చౌదరి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులకు మహర్దశ

మూడు రోడ్లకు రూ.38.5 కోట్లతో ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటకుమారి

కోడూరు: మండలంలోని మూడు ప్రధాన రహదారుల నిర్మాణాలకు రూ.38.5 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. శనివారం కోడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరంగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణానికి సంబంధించి రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ ఏఈ భాను కిరణ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కోడూరు-ఊటగుండం రహదారి మరమ్మతులకు రూ.2 కోట్లు, వి.కొత్తపాలెం-విశ్వనాథపల్లి రహదారి మరమ్మతులకు రూ.1.5 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ప్రస్తుతం ఫైనాన్షియల్ అనుమతుల దశలో ఉన్నాయని, ఈ ప్రక్రియ పూర్తి కాగానే టెండర్ పిలిచి రహదారుల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు ఏఈ తెలిపారు. ప్రతి ఎకరానికి సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. అధికారుల తీరుకు నిరసనగా ఆరుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు సమావేశం మధ్యలో నుంచి బయటకు వెళ్లిపోయారు. అధికారులు తమ ఇష్టానుసారంగా చెప్పుకుంటే వెళ్లిపోతున్నారే గాని తాము అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం లేదని, అభివృద్ధికి కనీస నిధులు ఇవ్వడం లేదంటూ ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషాలు ఎంపీటీసీలు, సర్పంచులకు నచ్చజెప్పారు. సోమవారం ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడి.. సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు.

పది మందికీ ఉపయోగపడేలా అభివృద్ధి చేద్దాం

మంత్రి జోగి రమేష్




మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: పది మందికి ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేస్తున్నామని, చేసిన అభివృద్ధిని ధైర్యంగా చూపి వైఎస్సార్ సీపీని దీవించాలని ప్రతి ఇంటికి వెళ్లి అడిగే ధైర్యం, దమ్ము మనకు ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం సాయంత్రం గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో పెడన నియోజకవర్గంలోని (జేసీఎస్) జగనన్న సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు చేయడానికి మొన్నటి వరకు రూ.20 లక్షలు మాత్రమే కేటాయించారని, ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిస్థితి వివరించడంతో నువ్వు తిరుగు నీకు రూ.40 లక్షలు ఇస్తానని జగనన్న మాట ఇచ్చారన్నారు. కాబట్టి సచివాలయ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి రూ.40 లక్షలు వస్తాయని, అభివృద్ధి ఏమైనా చేయాల్సి ఉంటే వాటిని గుర్తించాలని చెప్పారు. ఇటీవల ఒకరొచ్చి సీసీ రోడ్డు వేయాలని కోరడంతో పరిశీలించాలని పీఏకు చెప్పామన్నారు. అందుకు రూ.6 లక్షలు ఖర్చు అవుతాయని గుర్తించి ఆయనతో మాట్లాడి సీ ఒక్క ఇంటి కోసం సీసీ రోడ్డు వేయడం వల్ల ప్రజలకు మేలు జరగదని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజల వద్దకు వెళ్లి అందరికి మేలు కలిగేలా సీసీ రోడ్లు వేయిస్తామని చెప్పు అంటే సంతోషంగా వెళ్లి ప్రజలకు చెప్పి రెండు సీసీ రోడ్లు వేయించుకున్నారన్నారు. దీంతో సదరు నాయకుడితో పాటు ఆ గ్రామస్తులు కూడా సదరు నాయకుడిని అభినందించారని, అదే విధంగా అందరూ కూడా పది మందికి మేలు కలిగేలా అభివృద్ధికి బాటలు వేసుకుందామని సూచించారు. ఎన్నికలకు సమయం లేదని, ఆరు నెలలు మాత్రమే ఉందని, ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిని సందర్శించి చేసిన లబ్ధిని వివరించడంతో పాటు అభివృద్ధిని తెలియజేయాలన్నారు. పెడన నియోజకవర్గ పరిశీలకుడు, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీలు వెలివెల చినబాబు, సంగా మధుసూదనరావు, పట్టణ, మండల కన్వీనర్లు నాగబాబు, రాజబాబు, రవి, వెంకట్రాజు, మల్లి, జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జీలు మతీన్, బెజవాడ నాగబాబు, సుబ్బారావు, బాపూజీ, జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

దళితులకు అండగా ముందుకు సాగుతున్నా

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



మాట్లాడుతున్న మారుమూడి విక్టర్‌ప్రసాద్

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అంబేడ్కర్ ఆలోచనా విధానాలతో ముందుకు సాగుతున్నానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా దళిత జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక పోలీస్ కల్యాణ మండపంలో ఆయనను ఘనంగా సత్కరించారు. విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దళితులు తన వద్దకు వచ్చి సమస్యలు వివరించడంతో ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సమస్య తీవ్రతను బట్టి ఘటనా స్థలాలకు వెళ్లి అక్కడి దళితులకు న్యాయం జరిగేలా చూస్తున్నానని చెప్పారు. దళితుల భూములను పెత్తందారులు ఆక్రమించుకుని దళితులను ఇబ్బందులు పెడుతుంటే విచారణ జరిపి దళితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. తనను నమ్మి ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దళిత జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఫోన్ చేస్తే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సొంత కుటుంబ సభ్యుడిలా విక్టర్ ప్రసాద్ పనిచేస్తున్నారని కొనియాడారు. తొలుత ముస్తాఖాన్‌పేట సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు విక్టర్‌ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జానీ), కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్ నోబుల్, కార్పొరేటర్ యంద్రపాటి నాగేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, దళిత జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి

నాగాయలంక: ఏటిమొగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పెద్ది క్రాంతికుమార్ (40) క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో ఉండగా విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందాడు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగి క్రాంతికుమార్ కింద పడిపోయాడు. ఆయనను వెంటనే అవనిగడ్డ ఏరియా ఆస్పత్రికి తరలించగా స్పాట్‌లోనే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య కరుణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. క్రాంతికుమార్ స్వగ్రామం కోడూరు మండలంలోని స్వతంత్రపురం గ్రామం. ఫీల్డ్‌లో వర్కు చేయడానికి వెళ్లినప్పుడు సరఫరా నిలపాల్సిన ఫీడర్ల తేడా కారణంగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి



గుడిసె శ్రీనివాసరావు (ఫైల్)

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మచిలీపట్నానికి చెందిన ఎల్రక్టానిక్ మీడియా విలేకరి గుడిసె శ్రీనివాసరావు (58) మృతి చెందాడు. ఈ ఘటనపై బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. డోకిపర్రు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ఓ ఎల్రక్టానిక్ మీడియా విలేకరిగా మచిలీపట్నంలో పనిచేస్తున్నారు. శుక్రవారం విధులు ముగించుకుని రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. సుల్తానగరం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావటంతో శ్రీనివాసరావు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే క్షతగాత్రుడిని 108 సిబ్బంది చికిత్స బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాసరావు శనివారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. శ్రీనివాసరావు మృతికి ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు సంతాపం తెలిపారు.